

# వైభవంగా గోదావరికి హారతి

గోదావరి నదికి హారతినిస్తున్న భక్తులు, దేవస్థాన సిబ్బంది

ధర్మపురి, డిసెంబర్ 12: కార్తీక మాసం ముగింపు సందర్భంగా ధర్మపురిలో గోదావరి హారతి కార్యక్రమాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. కార్తీక మాసం చివరి రోజైన మంగళవారం భక్తులు గోదావరిలో స్నానం చేసి కార్తీక దీపాలను వదిలారు. దేవస్థానం తరపున లక్ష్మీనర్సింహ స్వామివారి ఆలయం నుంచి సాయంత్రం వేళలో దేవస్థాన సిబ్బంది మేళ తాళాలతో గోదారి నది వద్దకు చేరుకొని నదీమ తల్లికి పండితులు పూజలు చేశారు. అనంతరం గోదావరికి హారతినిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి, గోదావరిలో కార్తీక దీపాలను వదిలారు. ఇక్కడ ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, డీసీఎమ్మెస్ చైర్మన్ డా.ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తెమ్మ, దేవస్థానం రెనోవేషన్ కమిటీ సభ్యులు ఇందారపు రామన్న, ఇనుగంటి రమావేంకటేశ్వరరావ్, వేముల నరేశ్, వేదపండితులు బొజ్జ రమేశ్‌శర్మ, ముత్యాల శర్మ, పాలెపు ప్రవీణ్‌కుమార్ శర్మ, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచారి, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచార్యులు, అభిషేకం పురోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, సంపత్‌కుమార్, రాజగోపాల్ పాల్గొన్నారు.



డాక్టర్ సంజయ్ కల్వకుంట్లను సన్మానిస్తున్న ఆటో డ్రైవర్లు

# ఆటో డ్రైవర్లకు అండగా బీఆర్ఎస్

- కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

మెట్‌పల్లి, డిసెంబర్12: ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడంతో ఉపాధి కోల్పోతున్న ఆటో డ్రైవర్లకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల భరోసా కల్పించారు. మంగళవారం మెట్‌పల్లి పట్టణంలోని నివాసంలో ఎమ్మెల్యేను ఆటో, టాటా మ్యాజిక్ డ్రైవర్లు కలిసి శాలువాతో సత్కరించారు. ప్రభుత్వం ఉచిత బస్ సౌకర్యం కల్పించడంతో తాము ఉపాధిని కోల్పోయి రోడ్డున పడాల్సిన పరిస్థితి ఏర్పడిందని, తమకు అండగా నిలవాలని విన్నవించారు. ఎమ్మెల్యే స్పందించారు. ఆటో కార్మికుల కోసం బీఆర్ఎస్ తరపున పోరాడి ప్రభుత్వం నుంచి న్యాయం జరిగేలా కృషి చేస్తానని భరోసా ఇచ్చారు.



బస్సులో ప్రయాణిస్తూ ప్రయాణికులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్

# బస్సులో ప్రయాణిస్తూ.. సమస్యలు వింటూ..

**ప్రయాణికులతో మమేకమైన పెద్దపల్లి కలెక్టర్**

పెద్దపల్లి, డిసెంబర్ 12: నిత్యం అధికారిక కార్యక్రమాల్లో బిజీ..బిజీగా ఉండే పెద్దపల్లి కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్ మంగళవారం ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తూ ప్రయాణికుల సమస్యలు ఓపికగా విన్నారు. మంథనిలో జరిగిన ప్రైమరీ టీచర్స్ కాంప్లెక్స్ మీటింగ్‌లో పాల్గొన్న ఆయన, తిరుగు ప్రయాణంలో కమాన్‌పూర్‌లోని బస్టాండ్ వద్ద ఒక సామాన్యుడిలా ఆర్టీసీ బస్సు ఎక్కారు. ఈ సందర్భంగా మహిళా ప్రయాణికులతో 'మహాలక్ష్మి పథకం' గురించి అడిగి తెలుసుకున్నారు. కండక్టర్‌ను సైతం బస్సులో మహిళలు ఎంత మంది ప్రయాణిస్తున్నారంటూ వివరాలు తెలుసుకోవడంతో పాటు ప్రయాణం సాఫీగా సాగేలా సహకరించాలని సూచించారు.

# దివ్యాంగులకు అండగా ఉంటా

**జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ ఎం సంజయ్ కుమార్**

జగిత్యాల, డిసెంబర్ 12: దివ్యాంగులకు అండగా ఉంటానని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ భరోసానిచ్చారు. దివ్యాంగులకు పెన్షన్ పెంచిన ఘనత మాజీ సీఎం కేసీఆర్ దేనని కొనియాడారు. తాము ఎల్లప్పుడూ ప్రజల పక్షాన ఉంటామని, ఏ సమస్య వచ్చినా పరిష్కారానికి కృషిచేస్తామని స్పష్టం చేశారు. జగిత్యాల వివేకానంద మినీ స్టేడియంలో మహిళలు, పిల్లలు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరంలో పాల్గొన్న, క్రీడల్లో ప్రతిభచూపిన దివ్యాంగులకు అదనపు కలెక్టర్ బీఎస్ లతతో కలిసి ఎమ్మెల్యే బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో జిల్లాలో 15,272 మందికి ₹4వేల చొప్పున పింఛన్ అందజేశామని చెప్పారు. ఇంత పెద్ద మొత్తంలో పింఛన్ అందించిన రాష్ట్రం దేశంలో ఎక్కడా లేదన్నారు. ధ్రువపత్రాలు లేని దివ్యాంగులకు సదరమ్ క్యాంప్ ఏర్పాటు చేసి ఇప్పించే బాధ్యత తనదేనని చెప్పారు. కలెక్టరేట్‌కు వెళ్లిన సమయంలో తమకు కూర్చోవడానికి వెయిటింగ్ హాల్ ఇప్పించాలన్న దివ్యాంగుల కోరిక మేరకు 7వ నంబర్ రూమ్ ఇప్పించినట్లు చెప్పారు. కార్యక్రమంలో సంక్షేమ అధికారి నర్సయ్య, స్థానిక కౌన్సిలర్ చుక్క నవీన్, రోటరీ క్లబ్ సభ్యులు శ్రీనివాస్, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.



74వ సారి రక్తదానం చేస్తున్న దివ్యాంగుడిని అభినందిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



కాళికామాత ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్

# కాళికామాత ఆలయంలో గంగుల పూజలు

కార్పొరేషన్, డిసెంబర్ 12 : నగరంలోని 24వ డివిజన్ పరిధిలో గల విశ్వబ్రాహ్మణకాలనీలోని కాళికామాత ఆలయంలో ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మేయర్ సునీల్‌రావు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అన్ని విధాలుగా ఆలయ అభివృద్ధికి సహకరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, కార్పొరేటర్ కుర్ర తిరుపతి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డికి శుభాకాంక్షలు

హుజూరాబాద్ ఎమ్మెల్యేగా ఎన్నికైన పాడి కౌశిక్‌రెడ్డికి మంగళవారం హుజూరాబాద్ పట్టణంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్ఛాలు అందించి, శాలువాలతో సత్కరించారు.

**- హుజూరాబాద్‌టౌన్, డిసెంబర్ 12**



ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

# చివరిమడికీ సాగునీరందిస్తాం

- రైతు కండ్లల్లో సంతోషమే ప్రభుత్వ లక్ష్యం
- చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

గంగాధర, డిసెంబర్ 12 : రైతులు యాసంగి పంటలు సాగు చేస్తున్నందున పంటలు ఎండిపోకుండా చివరి మడి వరకు సాగునీరు అందిస్తామని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం స్పష్టం చేశారు. మంగళవారం గంగాధర ఎల్లమ్మ చెరువు కట్ట మరమ్మతు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అధికారులు ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి నారాయణపూర్ రిజర్వాయర్‌కు నీటిని విడుదల చేసి, పంటలకు సాగునీరు అందించాలని ఆదేశించారు. ఇక్కడి ముంపు గ్రామాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇక్కడ జడ్పీటీసీ పుల్కం అనురాధనర్సయ్య, సింగిల్ విండో వైస్ చైర్మన్ వేముల భాస్కర్, సర్పంచ్ తోట వేదాంతి మహిపాల్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు పురుమల్ల మనోహర్, నాయకులు పాల్గొన్నారు.



ఎల్లమ్మ చెరువు కట్ట మరమ్మతు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సత్యం

# బో'నమో' పోచమ్మ

బోనం సమర్పించడం కోసం బారులు తీరిన భక్తులు



రాజన్న అనుబంధ దేవాలయమైన బద్దిపోచమ్మకు మంగళవారం భక్తులు పోటెత్తారు. నెత్తిన బోనాలు ఎత్తుకుని డప్పు చప్పుళ్ల మధ్య నృత్యాలు చేస్తూ పురవీధుల గుండా ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి కల్లుపోసి, సారె పెట్టి బోనాలు సమర్పించి, పట్నాలు వేసుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అనుబంధ దేవాలయ పర్యవేక్షకులు హరిహరనాథ్ ఆధ్వర్యంలో ఎడ్ల శివ, వెంకటేశ్, శివరాజ్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

**- వేములవాడ టౌన్, డిసెంబర్ 12**